# ఆరాధన

గోదారి గట్టెక్కి, తూరుపు తెరను చీల్చుకు వస్తున్న సూర్యుణ్ణి చూస్తున్నాడు శివయ్య. ఏ రోజుకారోజే కొత్త. ఎన్నడూ చూసి ఎరుగని సరికొత్త ఆటవస్తువును పసివాడు చూస్తున్నట్లు పరవశించి మరీ చూస్తున్నాడు. గట్టు కింద వాలులోని అరటితోపులో పని చేసుకుంటున్న పాలేరు కాముడికి అదే అర్థంకాని విషయం. రోజూ అలా ఆకాశంలోకి ఎందుకు చూస్తాడూ అని. అలాటి తన్మయ స్థితిలోంచి కోలుకొని శివయ్య చేతికర్రను బలంగా నేల మీద అదుపుతూ గట్టు దిగి ఇంటి దారి పడతాడు. దారిలో నీడలా కదులుతున్న వాణ్ణి నిశితంగా చూసి, "కాముడూ! మీ నాయన కాలునొప్పి తగ్గిందిరా" అని హీనస్వరంతో పలుకరించాడు ఆరోజు. చేతి సౌజ్ఞల సహాయం కూడా లేకపోతే ఆ ప్రశ్న కాముడికి స్పష్టంగా వినిపించి అర్థమయ్యేది కాదు. అర్థం కాగానే 'తగ్గిందయ్యా' అని తల ఊపాడు.

సెంటు భూమి తనకు లేకున్నా, ఆ పరిసరాల్లో పనిచేసుకునే పాలేళ్ళు శివయ్య కళ్ళ ముందు పెరిగి బట్ట కట్టిన వాళ్ళే. ఆ గ్రామంలో చాలా కాలం స్కూలు టీచర్‌గా పనిచేసి విరమించాడు శివయ్య. ముత్యాల కోవలాటి తన ఒరవడితో ఎందరి చేతనో అక్షరాలు దిద్దించాడు. అలా అందరితో పరిచయమున్నవాడు. రాత్రి

పూట దీపాల వేపు చూస్తే ఏడు రంగుల వలయాలు కనిపించి నడక తడబడుతుంది కానీ, పగటి వెలుగులో దృష్టి లోపం ఏమంత బాధించదు. బాగా ఎరిగిన మనుష్యుల మధ్య చేతి సౌజ్ఞలతో, హావభావాలతో దినచర్య సాఫీగా సాగిపోతుంది. కానీ హీనస్వరం అంతగా బాధించదు. ఎక్కువగా కొత్తవాళ్ళతో మాట్లాడవలసి వస్తే పలకా బలపం ఆ లోటు తీరుస్తుంది.

ఇంటికి వెళ్తూనే శివయ్య వాకిట్లో ఎత్తి పెట్టిన నులక మంచం వేసుకుని విశ్రాంతిగా నడుం వాల్చాడు. పచ్చని కొబ్బరాకులు పరస్పరం కొట్టుకుంటూ పిల్లలు ఒప్పుల కుప్పలాడినట్లు గాలికి కదలాడుతూ వుంటే చూస్తూ మగతలోకి జారుకున్నాడు. పది నిముషాలన్నా కాలేదు. కంటి మీద ఏదో నీడపడ్డట్టు అనిపించి కళ్ళు తెరిచాడు. ఎదురుగా కూతురు రేవతి. ఉత్తరమైనా లేకుండా ఉదయాన్నే రావడంలో ఏదో విశేషమే ఉండి ఉంటుందనుకుంటూ వుంటే, "ఒంట్లో బావుందా నాన్నా! ఇంకా వెంకటమ్మ రాలేదూ?" అని తండ్రి మీదికి వొంగి స్వరం పెంచి అడిగింది.

"వెంకటమ్మ రోజూ వేకువనే వస్తుంది. ఇవాళే ఆలస్యమైంది. నిన్న చూస్తే దాని బర్రె పడుకోలేక జాలిగా బరువుగా నిలబడి ఉంది. ఇంకా ఈనలేదేమో" అన్నాడు అతి మెల్లిగా.

ఆరేళ్ళ క్రితం పట్నం రమ్మని కొడుకూ కోడలూ వచ్చి అడిగితే, "మీ ఉరుకుల పరుగుల మధ్య, కాళ్ళకడ్డపడుతూ మేమెందుకురా. ఇలా ప్రశాంతంగా బ్రతకనీ-" అని దాటవేశాడు.

ఏడాది క్రితం మళ్ళా వచ్చి, "నాన్నా మేం దుబాయ్ వెళ్తున్నాం. ఇక్కడ ఒక్కడివే ఎందుకు, చెల్లెలు దగ్గరకు వచ్చి వుండు" అని సూచిస్తే, "పుట్టి పెరిగిన ఊరిలో నాకేం కష్టం. అవసరమైతే రేవతి దగ్గరకు వెళ్తాలే" అని భరోసా ఇచ్చాడు.

ఇప్పుడు రేవతే వచ్చింది. "నిన్ననే ఉత్తరం వచ్చింది. అన్నా వదినా ఇంకో ఏడు దుబాయ్‌లో ఉండాలట. ఈ వయసులో నువ్వు ఒక్కడివే అయిపోయావ్. ఇలా ఉంటే మాకు అప్రతిష్ఠకాదూ?" అని అనునయించింది.

ఇక తన జీవితంలో వచ్చిపడ్డ మార్పును అంగీకరించి సరే అనక తప్పలేదు శివయ్యకు.

✣ ✣ ✣

పెళ్ళి అయిన దగ్గర నుంచీ పట్నవాసపు జీవితానికి అలవాటుపడ్డ రేవతి ఈ మార్పు గురించి ఎక్కువగా ఆలోచించకున్నా చేపని నీట్లోంచి తీసి ఒడ్డున వేసినట్లయింది శివయ్యకి. సహనశీలి కాబట్టి సర్దుకుపోతున్నాడు. మేడ మీది చిన్నగది శివయ్యది. దానికున్న ఒకే కిటికీ వీధిలోని కొంత భాగాన్నీ, గుప్పెడు ఆకాశాన్నీ చూపిస్తుంది.

మనవలు మరీ తన దగ్గరే ఉండి కథలడిగి చెప్పించుకునే అంత చిన్నవాళ్ళు కారు. వాళ్ళ స్కూళ్ళు, హోంవర్కు, కంప్యూటర్లు - వాళ్ళ లోకం వేరు. ఎప్పుడన్నా చిన్న మనవరాలు తనతో వస్తే అలా వీధి చివర పోస్టాఫీసు దాకా నాలుగడుగులు వేసి ఆ తర్వాత రోడ్డు రద్దీగా ఉంటే వెనక్కు వచ్చేస్తాడు.

అటూ ఇటూ ఇళ్ళ వరుసలకు మధ్యగా ఉన్న వీధి రోడ్డు ఇరవై అడుగులన్నా వెడల్పు ఉందో లేదో అనుమానమే. రోడ్డు మీదికి ఉరికిపడ్డంలో పోటీ పడుతున్నట్లు ఇళ్ళు కట్టేసుకున్నారు. రోడ్డుకీ, వీధి గుమ్మానికీ, మధ్య ఎడం లేకపోతే పోయె, కనీసం ఇంటికీ ఇంటికీ మధ్య కాసింత గాలి పారే అవకాశం లేకుండా మొహానికి మొహం దాపు పెట్టినట్టు ఆనించి కట్టుకున్న ఇళ్ళలో చెట్టూ చేమా ఇంక ఏం వేసుకుంటారు అనుకుని నిట్టూర్చాడు. అలౌకికమైన ఆలోచనల్లో విహరించే శివయ్యకు తెలియని వాస్తవాలు ఈ తరం రేవతి లాంటి చదువుకున్న గృహిణికి తెలియకపోవు. అంగుళం నేల ఆర్జించి పెడుతున్న అద్దె రాబడుల ముందు ఏది ఆరోగ్యం, ఏది జీవితం అన్న విచక్షణ కొట్టుకుపోతుందన్న సత్యం కూతురుకి తెలుసు. తండ్రి వేపు నిశితంగా చూసి, " కొద్ది రోజుల్లో ఇంకో మంచి కాలనీకి మారిపోదాంలే. ఇదేం కట్టుకున్న ఇల్లు కాదుగా" అని ఊరడించినట్లు మాట్లాడింది.

ఆ కిటికీలో కానవచ్చే ప్రపంచం, మధ్య మధ్య యోగ నిద్రలాంటి చిన్న కునుకు, తన మనసులో మెదిలే ఆలోచనలు వెరసి శివయ్య దైనందిన జీవితం అయింది.

ఒక వేకువన లేచి కిటికీలోంచి నాలుగు వేపులా చూస్తున్న శివయ్యకు ఒక చెట్టు కళ్ళబడింది. పడిపోతున్న ఇటుకల గోడనానుకుని ఉన్న ఆ చెట్టు మహా వృక్షం కాదు. అలా అని మరీ చిన్న మొక్కా కాదు. ఆకుపచ్చని గొడుగును విప్పి మట్టిలో పాతి నిలిపినట్టుంది. ఒక్కోఒక్కో పువ్వుగా పోటీ పడి పూసినట్టు వెన్న ముద్దల్లాంటి తెల్లని పూలతో కనువిందు చేసింది. ఈ చెట్టు తన కంటిని తప్పించుకున్నందుకే ఆశ్చర్యపడ్డాడు. కిటికీలోంచి కాసింత ఓరగా చూస్తేనే కనిపిస్తుంది. ప్లాస్టిక్ ఆకుల తోరణాలు కట్టుకుని తనకు దూరంగా జరిగిపోతున్న నాగరీకులకు తన సౌందర్యాన్ని కాసింతైనా చూపాలన్నట్టు ప్రకృతి ఆ రూపంలో నిలిచి నవ్వినట్టు తోచింది. కళకళలాడుతున్న రెమ్మల చుట్టూ తేనెటీగలు, సీతాకోక చిలుకలు గిరికీలు కొడుతున్నాయి. చిన్న చిన్న పిట్టలు రెమ్మల మాటున దోబూచులాడుతున్నాయి. శివయ్యతోపాటు ఆనందాన్ని పంచుకుంటున్నట్టు కిలకిల రావం చేస్తున్నాయి. పడుకున్న మంచం మీంచి కిటికీలోంచి ఆ దృశ్యం చూస్తూ ఇంకా పచ్చదనాన్ని విడవని తన గ్రామాన్ని తలచుకుంటూ ఒక పావుగంట నిద్రలోకి జారుకున్నాడు. కంటి మీద ఏదో నీడ పడినట్లనిపించింది.

“తాతయ్యా! పాలు” అంటూ చేత్తో పాల గ్లాసుతో నిలుచున్న మనవరాలు కనిపించింది. గ్లాసు అందుకుని పాలు తాగుతూ చెట్టుని చూశాడు. ఒక క్షణం తన గుండె లయ తప్పినంత పని అయింది. ఎంత వెదికినా ఒక్క పువ్వు లేకుండా నిలువు దోపిడికి గురైనట్టు విచారంగా నిలుచుంది. తరుహీన జలహీన నిర్జీవ నిర్వేల మరుభూమిలాటి ఆ ప్రాంతంలో ఒక చెట్టు దగ్గరగా కనుపించడమే అదృష్టం అనుకున్నాడు. కానీ విరబూసిన ఆ చెట్టుకి ఒక్క పువ్వైనా విడవకుండా కోసిన దెవరన్న జిజ్ఞాస మనసును దొలిచింది.

మరునాటి వేకువన తన ప్రశ్నకి కాసింత సమాధానం దొరికినట్టయింది. ఇద్దరు పిల్లలు - సుమారు ఏడెనిమిదేళ్ళ ప్రాయం వాళ్ళు, చేతిలో సజ్జపట్టుకుని తలంటి పోసుకున్న తలలు ఆరబెట్టుకుంటూ, ముచ్చటలు చెప్పుకుంటూ కాలివేళ్ళ మీద నిలబడి అందీ అందని పూలు అందుకుంటూ కనిపించారు శివయ్యకు. పిల్లలు చూడముచ్చటగా ఉన్నారు. చెట్టు పూలతో కళకళలాడుతోంది. రేవతి పాలు

తీసుకొచ్చి తండ్రికి అందించింది. పాలు తాగుతూవుంటే చెవి దగ్గరగా వచ్చి దుబాయ్ నుంచి అన్న రాసిన విషయాలు విడమరచి చెప్తోంది. అలా అర్ధగంట గడచి కూతురు క్రిందికి వెళ్ళిన తర్వాత అలవాటుగా శివయ్య దృష్టి ఆ పూల చెట్టుమీద పడింది. ఎప్పటిలా ఒక్క పువ్వు లెక్కపెట్టడానికైనా మిగలకుండా బేలగా నీరసంగా నుంచుంది. ఇదెలా సాధ్యం? ఆ పిల్లలకు , ఎంత కష్టపడినా క్రింది రెమ్మల పూలు తప్ప శిఖరాగ్రంలోని పూలు అందవుకదా. ఇలా పువ్వన్నది మిగలకుండా కొయ్యగలవాళ్ళు ఎవరో పెద్దలే అయివుండాలి. అలా శివయ్య తలలో ఇంకో శేష ప్రశ్న నిలిచిపోయింది. నూరు శరత్తుల ప్రస్థానంలో ముప్పాతిక దూరం నడిచి ఏకాంతంగా కాలం గడపవలసి వస్తే మెదడుకి మేతగా ఇలాటి ప్రశ్నలు వేసుకోక తప్పదేమో శివయ్యలాటి వయో వృద్ధులకి.

మరునాటి వేకువనే అలవాటు చప్పున పరమాత్మ ఎదురుగా నిలచి నవ్వి పలకరించినట్టు కనపడ్డ పూలచెట్టుని చూసి రెండు కళ్ళూ ప్రసన్నంగా మూసుకున్నాడు ఒక్క క్షణం. అలాటి సమయంలో తరచుగా మీద వాలే యోగ నిద్రలాటి మగతను తప్పించుకుని రెండు కళ్ళూ విప్పి చూశాడు. చిన్న పిల్లలు వచ్చి ముచ్చటలాడుకుంటు క్రింద రెమ్మల పూలు కోసుకుంటున్నారు. ఏదో ఆలస్యమైపోయినట్టు హడావిడిగా వచ్చాడొకడు. తెల్లని పంచె, మెడలో రుద్రాక్షలు, ఒక చేత వెండి సజ్జ, ఇంకోచేత చేతికర్ర. పుష్టి పూర్తి చేసుకున్నవాడే అని బట్టతల చుట్టూ తెల్లగా నెరసిన జుత్తు కాసింత వంగిన వెన్నెముక తెలియజేస్తున్నాయి. ఏదో అల్లరి చేస్తున్న పిల్లలను అదిరిస్తున్న ధోరణిలో చేతికర్రను తాటిస్తూ వచ్చి పూలుకోస్తున్నాడు. ఆ చెట్టుమీద అధికారం తనదే అన్నట్టు, యంత్రంలా ప్రదక్షిణ చేస్తూ, కనుపించిన ప్రతి పువ్వునూ కోస్తూ, పై పై రెమ్మల పూలు అందకుంటే తన చేతికర్ర కొంకితో తన కందుబాటులోకి తెచ్చుకుని ఆయాసపడుతూ రెమ్మలు వంచి మరీ కోస్తున్నాడు. ఇక ఎక్కడా పొరపాటునైనా పువ్వు మిగలలేదని నిర్ధారించుకున్నాక అక్కడనించి నిష్క్రమించాడు.

చేష్టలుడిగి చూస్తున్న శివయ్య తలలో మరికొన్ని కొత్త ప్రశ్నలు. ఏం చెయ్యడానికా పూలు ? కళకళలాడుతున్న చెట్టును నిలువు దోపిడీ చెయ్యాలా?

వచ్చే తరానికి ప్రవర్తనా పరంగా చక్కని ఒరవడి ఎలా పెట్టగలడు? ఇలా ప్రశ్నలు వేసుకుని నిట్టూర్చాడు.

రోజూ వేకువనే ఎదురయ్యే దృశ్యం ఎంతో ఆనందాన్ని కల్గించక ప్రశ్నల వలయంలో గిరగిర తిప్పేది. అప్పుడప్పుడు పూలు తెంపుకునే చిన్న పిల్లల వెనక పెద్ద వాళ్లు చేరి వృద్ధుడితో ఏదో తగవులాడుతున్నట్లు కూడా తోచేది. ఏం వాదించు కుంటున్నారో వినికిడీ తక్కువైన శివయ్యకు వినిపించకపోయినా చిన్నతనంలో తాను పట్నం వెళ్ళి చూసిన మూకీ చిత్రంలా ఆ దృశ్యాన్నీ, కదలికల్నీ అర్థం చేసుకునే ప్రయత్నం చేసేవాడు. ఆ ఘర్షణ ఒక్కోసారి పరాకాష్ఠకు చేరుకునేది.

మధ్యాహ్న భోజనానికి కాసింత ముందు కిందకు దిగి కూతురు ఎదుట కూర్చుని కష్ట సుఖాలు మాట్లాడుకునే శివయ్య ఒకటి రెండు సార్లు తను వేకువవేళ చూస్తున్న దృశ్యం గురించి ప్రస్తావించి 'ఎవరిదాచెట్టు? ఎవరా వృద్ధుడు?' అని ప్రశ్నించాడు.

"మొట్టమొదట ఆ చెట్టున్న జాగాలో ఎవరో నాలుగు మొక్కలేసుకుని చిన్న ఇల్లు కట్టుకున్నారట. క్రమంగా ఇక్కడ జాగాలకు ధర ఎక్కువ పలకడం, అద్దెల రాబడి పెరగడం మొదలయ్యింది. పాపం వాళ్ళు తీర్థయాత్రలకని ఒక నెలకు పైగా ఎక్కడెక్కడికో వెళ్ళి తిరిగి వచ్చేలోగా మూడు వేపులా ఉన్న ఇళ్ళ వాళ్ళు వీళ్ళ ప్రహరీ గోడలకా నించి గదులు విస్తరించి కట్టేసుకున్నారట. ఇదేం అన్యాయం? గాలీ వెలుగు కోసం ప్రతి ఇంటి వారూ కొంత జాగాను ఇంటి చుట్టూ ఖాళీగా విడిచిపెట్టవద్దా! అని అడిగితే ఆ మూడిళ్ళవాళ్ళూ ఒక్కటై మీకేమి నష్టం మేం జాగా వదలక మా ఇళ్లు కట్టుకుంటే అని తగవుకు వచ్చారట. కౌన్సిలరూ, చైర్మన్, ప్లానింగ్ ఆఫీసర్లూ లంచమిచ్చిన ముగ్గిరి వేపూ మొగ్గు చూపితే ఇక కోర్టుల చుట్టూ తిరగడం, తగవులూ ఎందుకని ఆ ఇల్లు కాస్తా అమ్ముకుపోయారట. పళ్ళచెట్లు అందరి దాడికీ రూపు లేకుండా పోయాక కేవలం పూలచెట్టవడం వల్ల ఆ చెట్టొక్కటీ మిగిలిపోయింది. ఆ జాగా కొనుక్కున్నది ఇళ్ళ వ్యాపారులు. ఇంకా ఈ ఇంటి గురించి పట్టించుకోక పోవటంతో ఆ పూలచెట్టును జాతీయం చేసేశారు వీళ్ళంతా. ప్రహరీగోడ ఇటుకలు

కూడా ఒక్కటొక్కటే తీసుకుపోతున్నారు. అయితే తొలి నుంచీ ఆ పూలు కోసుకుంటున్న కారణంగా ఆ చెట్టు పూల మీద అధికారం ఎక్కువగా తనదే అన్నట్లు ఆ పండితుడు అందరితోనూ తగవు పెట్టుకుంటూ వుంటాడు. పేరు చిదానందం. ఈ మధ్యే ఏదో సంస్కృత కళాశాలలో చేసి రిటైర్ అయ్యాడు. మనం అద్దెకు ఉంటున్న ఈ వాటా కూడా అతనిదే. మన ప్రక్కనే అతని ఇల్లు కూడా. ఈమారు అద్దెకు మొదటి వారంలో వస్తే మీకు పరిచయం చేస్తాను. కొంచెం చాదస్తం మనిషి. రోజూ సాలగ్రామానికి పూజ చెయ్యందే మనసు ప్రశాంతంగా ఉండదట" రేవతి తండ్రికి దగ్గరగా వచ్చి నెమ్మదిగా వివరించింది.

"చదువుకున్న వాడైతే ఛాందసం తగ్గి పరమార్థాన్ని గ్రహించాలి. సరే, అనుకోకుండా నాకు ఎదురైతే నువ్వు పరిచయం చేద్దుగాని. కోరి నన్ను పిలిచి ఆ పనిచేయ్యకు" అని నిట్టూర్చి ప్రశాంతంగా కళ్ళు మూసుకున్నాడు శివయ్య.

ఎంత ఉపేక్షించినా వేకువ దృశ్యం శివయ్యను కదిపి, నిశ్చల జలాశయంలోకి రాయి విసిరినట్టు ఆలోచనల వలయాలు రేపి, అశాంతికి గురిచేస్తున్నాది. ఇంత చిన్న విషయానికి నేనెందుకు ఇంతగా ఆలోచించాలి అనుకున్నాడు. కానీ ఆలోచన లేనిదే మనిషికి అర్థమేమిటని మళ్ళా ప్రశ్నించుకున్నాడు. ఈ ఆలోచన ఈ కిటికీ దాటి బయటకు ప్రసరిస్తేనే కదా ప్రతిస్పందనకు అవకాశం అని తన సులోచనాలు తీసి గుడ్డతో శుభ్రంగా తుడుచుకున్నాడు. కాసింత భూమి నాదంటే నాదని ఇరుగు పొరుగు దేశాలు యుద్ధానికి సిద్ధమౌతున్నాయి. నదిలో నీళ్ళ కోసం ఇరుగు పొరుగు రాష్ట్రాలు తగువులాడుకుంటున్నాయి. ఎవరిదీ కాని చెట్టు పూసిన పూల కోసం పండితుడు పసిపిల్లలతో పోటీపడుతున్నాడు. ఇది చిన్న విషయంలా కనిపించే పెద్ద విషయమే అనుకుని ఉత్తరం పూర్తి చేసాడు.

"తాతా! ఇవాళ నే స్కూలు నించి వేగం వచ్చేశాను. అలా నడుచుకు వెళ్దాం వస్తావా?" అన్న చిన్న మనవరాలితో 'పద నేనూ వస్తా'నని పోస్టాఫీసు దాకా నడిచాడు. ఉత్తరం పోస్టు చేశాక తన వంతు బాధ్యత తీరినట్లు అయింది.

చిదానందం అందుకున్న ఉత్తరాన్ని నిశితంగా చూశాడు. ఆ ముత్యాల్లాంటి అక్షరాలు తనకు ఎన్నడూ పరిచయమైనవి కావు. మనసులోనే చదువుకున్నాడు.

"ఊహ తెలియని పసివాళ్లకి క్రమక్రమంగా విశ్వరూపాన్నే అవగాహన చేసుకునే శక్తి వచ్చేలాగ, వారి చేతికందివ్వలేని ఆవునీ, ఏనుగనీ, పులినీ ఆటబొమ్మలుగా అందిస్తాం.

భావాతీతం, యోగిహృధ్యాన గమ్యం అనతగిన విశ్వసౌందర్యాకృతిని ఆరాధనా సౌలభ్యం కోసం చేతికందేలా మనం మలచుకున్నదే కదా సాలగ్రామం. మనసారా రెండు పూలు వేస్తే చాలదూ? మీలాటి పండితులు ఊహ తెలియని పసివాళ్ళతో పోటీపడాలా? ప్రకృతి తనకు తానుగా అలంకరించుకోవడం కేవలం మానవ మాత్రుల కోసమేనా? ఆ ఆనందానుభవాన్ని సకల జీవరాశికీ దూరం చేసి మీ ఇంటి నాలుగు గోడలకే పరిమితం చేస్తారా?

ఆరాధన మనసును కోమలంగా తీర్చి ఆధ్యాత్మికానంద తీరానికి దారిని చూపాలే గానీ అదే గమ్యమైపోరాదు. ఇది మీరెరుగని సత్యం కాదు. ఒకమారు గుర్తు చెయ్యాలన్నదే నా తపన.

సుమారు పదిహేను శరత్తులైనా మీకన్నా ఎక్కువ చూసి ఉంటాను. ఆ కారణంగానే తీసుకుంటున్న ఈ చనువును ఔదార్యంతో క్షమించండి.

- శివం "

ఉత్తరం ఎక్కడి నుండి వచ్చినదీ చిదానందానికి అర్థం కాలేదు. కాసింత ముఖం ఎర్రబడింది. తన కాలనీకి దగ్గరగా ఉన్న పోస్టాఫీసు ముద్రలే ఉన్నాయి. రెండు కళ్ళూ మూసుకున్నాడు. జడత్వం కరిగి నెమ్మదిగా నీరౌతూ వుంటే ముఖంలోని ఎరుపు తగ్గుతూ వచ్చింది. దీర్ఘంగా ఆలోచించాడు. ప్రతి అక్షరం ఏదో సందేశమిచ్చినట్లయింది. కళ్ళు మూసుకుని నిట్టూర్చాడు.

శివయ్య ఎప్పటిలా వేకువనే చెట్టుని చూస్తూనే ఉన్నాడు. పిల్లలు వచ్చి వాళ్ళ కందిన పూలు కోసుకుంటూనే ఉన్నారు. చిదానందుడు నాలుగు పూలు

కోసుకుని ఏ ఘర్షణా పడకుండా వెళ్ళిపోతున్నాడు. చెట్టు కళకళలాడుతూ లోకాన్ని పలుకరిస్తోంది. సాయంత్రం వరకు శివయ్యలాటి భావుకులకూ, ఎన్నెన్నో కీటకాలకూ, పిట్టలకూ కనువిందు చేస్తూ వాడిన పూలను నేల రాలుస్తోంది. తిరిగి సరికొత్త పూల తొడుగుతో సరికొత్త వేకువకు స్వాగతం చెప్తోంది. నవనవోన్మేషమైన పరమాత్మ స్వరూపంగా చెట్టును చూసి నిరామయంగా పరవశిస్తాడు శివయ్య.

✣ ✣ ✣

*(రచన, ఆగస్టు 2002 ,కథాపీఠం ఎంపిక)*

✣ ✣ ✣